నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 12 ఫిబ్రవరి 2025 | NIZAMABAD

# అధికార పార్టీలో అసంతృప్త రాగాలు

**ఫామ్‌హౌస్ భేటీలో ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు?**

**పాల్గొన్నది ఒక్కరా.. ఇద్దరా..?**


**మంత్రి పదవి రాకపోవడమే భేటీకి కారణమా?**

**అమాత్యుల ఆధిపత్య పోకడలు తాళలేకే సమావేశమా?**

**నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో జోరుగా చర్చ**

**కాంగ్రెస్‌లో సరికొత్త దుమారం రేపిన వ్యవహారం**

**ఉమ్మడి జిల్లా కాంగ్రెస్‌లో వెల్లువెత్తుతున్న అసంతృప్త స్వరాలు**



నిజామాబాద్, ఫిబ్రవరి 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) కాంగ్రెస్ పార్టీలో కొత్త కుంపటి రాజుకున్నది. అసంతృప్త ఎమ్మెల్యేల ప్రత్యేక భేటీల పర్వం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నది. ఇందులో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఉండడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. కొంత మంది మంత్రుల తీరును నిరసిస్తూ వీరంతా సమావేశమయ్యారని జోరుగా ప్రచారం జరుగుతున్నది. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి సైతం ఈ విషయంపై బాహాటంగానే నోరు విప్పడంతో సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. ఎమ్మెల్యేలకు తగిన గుర్తింపు లేకపోవడం, తమ మాటను ఎవరూ పట్టించుకోకపోవడం, చేపట్టిన పనులకు ఉన్నత స్థాయిలో వసూళ్ల పేరుతో దోపిడీ చేస్తుండడంతోనే ఎమ్మెల్యేలంతా ఓ ఫామ్ హౌస్‌లో సమావేశమై చర్చించుకున్నట్లు తెలుస్తున్నది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇద్దరు కొత్త ఎమ్మెల్యేలు ఈ భేటీకి హాజరైనట్లు ప్రచారం జరుగుతుండడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తున్నది. గతంలో ఇతర పార్టీలో పని చేసి కాంగ్రెస్ గూటికి చేరి ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి 'అసమ్మతి భేటీ'కి హాజరైనట్లు స్పష్టత వచ్చినప్పటికీ, ఉమ్మడి జిల్లాకు చెందిన మరో ఎమ్మెల్యే పాల్గొనడంపై ఎలాంటి స్పష్టత రావడం లేదు. ఫామ్‌హౌస్ సమావేశంలో ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నట్లు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం జరిగింది. భేటీలో పాల్గొన్నది వాస్తవమని చెప్పేందుకు కానీ, పాల్గొనలేదని ప్రకటించేందుకు కానీ సదరు ఎమ్మెల్యేలెవ్వరూ ముందుకు రాకపోవడమూ గమనార్హం

## దేనికోసమో..?

కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి 15 నెలలవుతున్నా ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి దిక్కులేదు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి సీనియర్, జూనియర్ ఎమ్మెల్యేలు నలుగురు ఉండగా, వీరిని కాంగ్రెస్ అధిష్టానం కనీసం పట్టించుకోవడం లేదు. రేవంత్ కేబినెట్‌లో 11 మంది మంత్రులుండగా, మరో ఆరుగురికి అమాత్య పదవులు ఇచ్చేందుకు అవకాశమున్నది. ఏడాది కాలంగా మంత్రి లేకపోవడంతో ఉమ్మడి జిల్లా పాలన అస్తవ్యస్తంగా మారింది. ఇన్‌చార్జి మంత్రి చెప్పినట్లే యంత్రాంగం పని చేస్తున్నది. తప్పితే కాంగ్రెస్ ఎమ్మెల్యేల మాటకు కనీస విలువ దక్కడం లేదు. కలెక్టర్లు, ఎస్పీ, సీపీ సైతం కొత్త ఎమ్మెల్యేలకు సరైన విధంగా గౌరవ, మర్యాదలు ఇవ్వడం లేదన్న ప్రచారం జరుగుతున్నది. గతంలో ఓ ఎమ్మెల్యేకు, సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ పెద్ద ఎత్తున ఝలక్ ఇవ్వడం రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపింది. ఇప్పటికీ ఎమ్మెల్యేల పరిస్థితి అదే స్థాయిలో ఉండడంతో కక్కలేక, మింగలేక అన్నట్లుగా హస్తం పార్టీ ప్రజా ప్రతినిధుల పరిస్థితి తయారైంది. తీవ్ర అసంతృప్తితో రగిలి పోతున్న ఎమ్మెల్యేలు ఎవరికి వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో తలమునకలయ్యారని, అందులో భాగంగానే క్యాంప్ రాజకీయాలకు ఆకర్షితులైనట్లు తెలిసింది. మంత్రివర్గ కూర్పులో చోటు కోసం, అలాగే, కొంత మంది మంత్రుల తీరుకు వ్యతిరేకంగా ఈ భేటీ ఏర్పాటు వేసినట్లు సమాచారం. 10 మందికి పైగా ఎమ్మెల్యేల రహస్య భేటీతో ఒక్కసారిగా అధికార పార్టీలో కలకలం రేగింది.

## ఆగమాగం..

హస్తంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్లు ఉంటుంది. పీసీసీ చీఫ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సొంత జిల్లాలోనే గందరగోళం చోటు చేసుకుంటున్నది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పలువురు సీనియర్లకు పదవులు దక్కకపోవడం, కష్టపడిన నేతలను పక్కన పెట్టడంతో అంతర్గతంగా అసంతృప్తి రగులుతున్నది. ఆరోపణలున్న వ్యక్తులకు పెద్ద పీట వేయడం, ఒకే సామాజిక వర్గానికి వంత పాడుతూ పదవులు కట్టబెడుతున్న తీరుపైనా చర్చ నడుస్తున్నది. ఈ విషయంలో బడుగు, బలహీన వర్గాల నేతలంతా గుర్రుగా ఉన్నారు. తాజాగా ఎమ్మెల్యేలే పార్టీ నియమ, నిబంధనలకు విరుద్ధంగా సమావేశం కావడంతో హస్తం పార్టీలో మరింత గందరగోళం నెలకొన్నది. డీసీసీ ప్రెసిడెంట్ మానాల మోహన్‌రెడ్డిని కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడంతో అధ్యక్ష పదవిని ఇంకొకరితో భర్తీ చేయాల్సిన అనివార్యత ఏర్పడింది. నెలలు గడుస్తున్నా ప్రభుత్వంలో పదవులు దక్కక, పార్టీలోనూ అవకాశాలు రాక చాలా మంది లోలోన రగిలి పోతున్నారు. ఈ క్రమంలోనే జరిగిన ఫామ్‌హౌస్ భేటీ ఉమ్మడి జిల్లాలో ప్రాధాన్యత సంతరించుకున్నది. ఈ వ్యవహారం ఇప్పుడు సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతున్నది. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన ఆ ఎమ్మెల్యేలపై కౌంటర్లు విసురుతున్నారు. ఇదేం పద్ధతి అంటూ సొంత పార్టీ లీడర్లు ఓ వైపు, ఇదీ కాంగ్రెస్ పార్టీ నైజం అంటూ సాధారణ ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు. ఈ భేటీ వ్యవహారం చినికి చినికి గాలి వానలా మారడంతో ఎమ్మెల్యేల నోటికి అధిష్టానం తాళం వేసింది.




కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, ఎల్లారెడ్డి నియోజక వర్గ నాయకులు

# కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే, నేతలు

**బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్** కేటీఆర్‌ను ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌గౌడ్, పార్టీ నేతలు మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై కేటీఆర్ మార్గనిర్దేశం చేశారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ. సర్పంచ్ ఎన్నికల్లో గెలిచే వారిని గుర్తించి, వారికే అవకాశం ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతున్నదని, ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ కోసం కష్టపడ్డ వారికే గుర్తింపు ఉంటుందన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, గాంధారి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యంరావు, శట్పల్లి సంగారెడ్డి విండో చైర్మన్ అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట/లింగంపేట్, ఫిబ్రవరి11



## 17న వృక్షార్చన..

**హరితహారం** ద్వారా తెలంగాణ భూతల్లికి ఆకుపచ్చని చీర కట్టిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఈ నెల 17న ప్రతిఒక్కరూ మూడు మొక్కలు నాటాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. కేసీఆర్ చేపట్టిన హరిత తెలంగాణ సంకల్పానికి మద్దతుగా మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ చేపట్టనున్న వృక్షార్చన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

– ఖలీల్‌వాడి, ఫిబ్రవరి 11



జుక్కల్ మండల కేంద్రంలో ఆటోపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న విద్యార్థులు

**అది మహారాష్ట్ర,** కర్ణాటక రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం. ఆర్టీసీ బస్సులు రాక ప్రయాణం నరక ప్రాయం. జుక్కల్ మండలానికి పెద్దగా బస్సులు రావు. దీంతో ఇక్కడి వారికి ఆటోలే దిక్కు. సమయానికి ఇంటికి చేరేందుకు ప్రజలు ప్రమాదకర రీతిలో ప్రయాణం చేస్తున్నారు. ఆటోకు ఇరువైపులా నిల్చోవడంతో పాటు టాప్‌పైనా కూర్చుని గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఆటోవాలాలు సైతం పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. జుక్కల్ నుంచి దోస్‌పల్లి, బంగారుపల్లి గ్రామాలకు వెళ్లే ఆటోలో ప్రయాణికులు నిండిపోవడంతో ఇద్దరు విద్యార్థినులను ఇలా టాప్‌పైన కూర్చోబెట్టారు. జుక్కల్‌లో మంగళవారం కనిపించిందీ దృశ్యం. ఇది చూసిన తల్లిదండ్రులు, గ్రామస్తులు పిల్లలకు ఏమైనా అయితే ఎవరు బాధ్యులని ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

– బిచ్కుంద, ఫిబ్రవరి11

# అడుగంటిన బోర్లు ఎండుతున్న పైర్లు..

**ఆందోళనలో రైతులు**

**ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు**




ధర్పల్లిలో నీరందక నెర్రెలు బారిన వరి పొలాలు



ట్యాంకర్ ద్వారా పంట పొలానికి నీరు అందిస్తున్న రైతు బానవత్ మంగీలాల్

### నెర్రెలు బారిన నేల..

భూగర్భజల వనరులు అడుగంటి పోతుండడంతో నీరందక పొలాలు ఎండుతున్నాయి. పచ్చని పైర్లు వాడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధర్పల్లి మండలంలో రైతులు ఎప్పటిలాగే ఈ యాసంగిలోనూ పెద్ద ఎత్తున వరి సాగు చేశారు. అయితే, భూగర్భ జలాలు తగ్గిపోవడంతో బోర్లు పోయడం లేదు. ధర్పల్లి శివారులోని రేకులపల్లి రోడ్డులో వేసిన వరి పైరు నీరందక ఎండిపోయింది. పొలం నెర్రెలు వారింది. ఇలాంటి స్థితిలో పంటను ఎలా కాపాడుకోవాలో అర్థం కాక రైతులు ఆవేదన చెందుతున్నారు. నీరందక పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ధర్పల్లి/సిరికొండ, ఫిబ్రవరి 11: పచ్చని పైర్లు ఎండిపోతున్నాయి. పొలాలు నెర్రెలు బారుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటడం, బోర్లు వట్టిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కండ్ల ముందే పంట వాడిపోతుండడంతో కన్నీరుమున్నీరవుతున్నారు. ధర్పల్లి, సిరికొండ మండలాల్లో ఈ పరిస్థితి నెలకొన్నది. పొట్టకొచ్చిన వరి ఎండిపోతుండడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు. ట్యాంకర్లతో నీళ్లు పడుతూ పంటను కాపాడుకునేందుకు భగీరథ ప్రయత్నం చేస్తున్నారు.

**భగీరథ ప్రయత్నం..**

సిరికొండ మండలం హుస్సేన్‌నగర్ లొంక తండాకు చెందిన రైతులు బానవత్ మంగీలాల్, సుంకరి అంజయ్య నాలుగు ఎకరాల్లో వరి సాగు చేశారు. ప్రస్తుతం అది పొట్ట దశకు వచ్చింది. ఇంకో పక్షం రోజులు నీళ్లు పెడితే పంట చేతికొస్తుంది. కానీ, భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎత్తిపోయాయి. దీంతో రెండు ఎకరాల్లో సాగు చేసిన వరి ఎండిపోయింది. మిగిలిన రెండెకరాలను కాపాడుకునేందుకు మంగీలాల్, అంజయ్య భగీరథ ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే నాలుగు బోర్లు వేశారు కానీ చుక్కనీరు రాలేదు. పొట్ట దశలో ఉన్న పంటను ఎలాగైనా కాపాడుకోవాలన్న ఉద్దేశంతో ట్యాంకర్ ద్వారా నీళ్లు పెడుతున్నారు. ఇందుకోసం నిత్యం రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇప్పటికే పంట సాగు పెట్టుబడితో పాటు బోర్లు వేయించడానికి భారీగా వెచ్చించారు. ఇప్పుడేమో రోజుకు రూ.3 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. మరో 15 రోజులు నీళ్లు పెడితే పంట చేతికొస్తుందని రైతులు చెబుతున్నారు. అయితే, ఇప్పటిదాకా పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి రాదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండిపోయిన పొలాలను సర్వే చేసి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని వారు కోరుతున్నారు.

# మధ్యాహ్న భోజనం మాకేది?

**కొందరు విద్యార్థులేమో పస్తులు..**

- మరికొందరేమో మండుటెండల్లో పరుగులు
- ఎల్లారెడ్డి పాఠశాల విద్యార్థుల దుస్థితి
- వారం రోజులుగా నిలిచిన మధ్యాహ్న భోజనం



ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ఎండలో వసతిగృహంలో భోజనం చేయడానికి వెళ్తున్న ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11: మధ్యాహ్న భోజనం పెట్టక పోవడంతో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తిప్పలు పడుతున్నారు. కొందరు విద్యార్థులు ఖాళీ కడుపులతో పస్తులున్నారు. మరికొందరు మండుటెండలో హాస్టల్‌కు వెళ్లి తిని వస్తున్నారు. వారం రోజుల నుంచి ఈ పరిస్థితి కొనసాగుతున్నది. పది రోజుల క్రితం పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి పలువురు విద్యార్థులు దవాఖాన పాలైన సంగతి తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు మధ్యాహ్న భోజన ఏజెన్సీని రద్దు చేశారు. వెంటనే కొత్త ఏజెన్సీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో స్థానికంగా ఉన్న మైనారిటీ గురుకుల పాఠశాలలో పని చేసే వారిని పిలిపించి మధ్యాహ్న భోజనం పెట్టించారు. రెండ్రోజులు వంట చేసిన తర్వాత వారు రావడం మానేశారు. ఫిబ్రవరి 4వ తేదీ నుంచి విద్యార్థులకు మధ్యాహ్నం తిండి లేకుండా పోయింది. పాఠశాలలో చదువుకుంటున్న ఆయా వసతి గృహాలకు చెందిన విద్యార్థులు హెడ్మాస్టర్ ఆదేశాల మేరకు భోజనం కోసం తమ వసతిగృహాలకు వెళ్తున్నారు. మధ్యాహ్నం వేళ మండుటెండలో ప్రధాన రహదారి మీదుగా నడుచుకుంటూ వెళ్లి తినేసి వస్తున్నారు. మిగతా విద్యార్థులలో కొంతమంది ఇంటి నుంచి భోజనం తెచ్చుకుంటుండగా, మరికొందరు పస్తులుంటున్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు మాత్రం స్పందించక పోవడం గమనార్హం. పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం పెట్టేలా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు